బీమాలోకి 100% ఎఫ్‌డీఐ!

అనుమతించే యోచనలో కేంద్రం • కీలక సంస్కరణలకు ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, నవంబర్ 18: దేశీయ బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తలుపులు బార్లా తెరువబోతున్నదా? అంటే అవుననే సంకేతాలే కనిపిస్తున్నాయిప్పుడు. బీమా రంగంలో కీలక సంస్కరణలకు సిద్ధమవుతున్న కేంద్ర ప్రభుత్వం.. అందులో భాగంగానే 100 శాతం ఎఫ్‌డీఐకి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వబోతున్నట్టు తెలుస్తున్నది. ఓ ప్రముఖ జాతీయ దినపత్రిక తాజాగా తెచ్చిన నివేదికలోని వివరాల ప్రకారం ఈ నెలాఖర్లో పార్లమెంట్‌కు వచ్చే వీలున్న ప్రతిపాదిత బీమా చట్ట సవరణ బిల్లులో పూర్తిగా విదేశీ బీమా కంపెనీలకు అనుమతివ్వబోతున్నారని సమాచారం. అయితే భారత్‌కు చెందిన బజాజ్ ఫిన్‌సర్వ్ వంటి కంపెనీల భాగస్వామ్యంతో దేశీయ బీమా రంగంలో సేవలందిస్తున్న అలియాంజ్ తరహా విదేశీ సంస్థలు ఈ జాయింట్ వెంచర్లకు గుడ్‌బై చెప్పి సొంతంగా బీమా కంపెనీలను ఏర్పాటు చేయాలని చూస్తున్న తరుణంలో ఈ మార్పులకు మోదీ సర్కారు ప్రయత్నిస్తుండటం గమనార్హం.

ప్రస్తుతం 74 శాతమే

దేశంలో ఉన్న బీమా కంపెనీల్లో ప్రస్తుతం ఎఫ్‌డీఐకున్న పరిమితి 74 శాతమే. అంటే.. ఇన్సూరెన్స్ కంపెనీ యాజమాన్యంలో విదేశీయుల వాటా ఏ రకంగానూ 74 శాతాన్ని మించరాదు. 26 శాతం తప్పకుండా భారతీయుల వాటా ఉండాల్సిందే. అయితే కొత్త బిల్లులో ఈ పరిమితిని పూర్తిగా ఎత్తివేయనున్నట్టు తెలుస్తున్నది. దీంతో విదేశీ కంపెనీలు భారత్‌లో ఇక్కడి కంపెనీల భాగస్వామ్యం లేకుండానే సొంతంగా బీమా సంస్థలను పెట్టుకోవచ్చన్నమాట. ఇన్సూరెన్స్ మార్కెట్‌లో ఇక స్వతంత్రంగా వ్యాపార కార్యకలాపాలు చేసుకోవచ్చు. తమ ఈ నిర్ణయం వల్ల భారతీయ బీమా రంగం బలోపేతమవుతుందని, విదేశీ పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తాయని, మార్కెట్‌లో పోటీ కూడా పెరిగి చౌక ధరలకే బీమా అందరికీ అందుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. అయితే స్థానిక సంస్థలకున్న అవకాశాలను ఇది దెబ్బతీస్తుందన్న ఆందోళనలు అటు మార్కెట్ వర్గాల నుంచి, ఇటు నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ఎల్ఐసీ కోసం

బీమా చట్టం సవరణతో కేంద్ర ప్రభుత్వం తేవాలని చూస్తున్న మార్పులు..

ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) విస్తరణకూ అవకాశాలు కల్పించేలా ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. కొత్త చట్టం అమలుతో ఆరోగ్య బీమా కంపెనీ దిశగా ఎల్ఐసీ అడుగులు పడుతాయని అంటున్నారు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం ఇది సాధ్యం పడడంలేదు. ఇదిలా ఉంటే బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ కూడా లైసెన్సులకు సంబంధించి కొన్ని మార్పులను చేయాల్సి వస్తుందని అంటున్నారు.

మరిన్ని మార్పులు

ఇప్పుడున్న బీమా చట్టాన్ని సవరిస్తూ తెస్తున్న కొత్త చట్టంలో ఇన్సూరెన్స్ ఏజెంట్లపైనున్న ఆంక్షల్నీ తొలగించాలని కేంద్రం భావిస్తున్నది. ఏజెంట్లు రకరకాల సంస్థలకు చెందిన పాలసీలను స్వేచ్ఛగా అమ్ముకునే సదుపాయాన్ని తేవాలనుకుంటున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఒక ఏజెంట్ ఒకే సంస్థకు పనిచేయాల్సి ఉన్నది. అయినప్పటికీ తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద అనేక కంపెనీలకు ఒక్కరే ఏజెంట్లుగా పనిచేస్తున్నది గమనిస్తూనే ఉన్నాం. కానీ కొత్త చట్టంతో ఇదంతా చట్టబద్ధం కానున్నది. జీవిత, జనరల్ ఇన్సూరెన్స్ రంగాల్లో ఏజెంట్లు ఎన్ని సంస్థల పాలసీలనైనా అమ్ముకోవచ్చు. దీని వల్ల దేశంలో బీమా పాలసీదారులు మరింత పెరుగుతారని కేంద్రం అభిప్రాయపడుతున్నది. కాగా, ప్రస్తుతం దేశంలో 24 జీవిత బీమా సంస్థలున్నాయి. మరో 26 జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలున్నాయి. అలాగే 6 ఆరోగ్య బీమా సంస్థలున్నాయి. వీటన్నిటికీ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ) రీఇన్సూరర్‌గా వ్యవహరిస్తున్నది.

కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్

కోలిండియాతో కలిసి ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తున్న సింగరేణి

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): దేశంలో మొదటిసారిగా కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారీకి సింగరేణి సంస్థ శ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మక ప్లాంటును మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని థర్మల్ విద్యుత్తు ప్లాంటులో ఏర్పాటు చేస్తున్నది. థర్మల్ ప్లాంట్‌లో బొగ్గును మండించడం ద్వారా వెలువడే కార్బన్‌డయాక్సైడ్‌ను హైడ్రోజన్ వాయువుతో మిళితం చేసి చివరగా మిథనాల్‌ను తయారుచేయనున్నారు. రోజుకు 500 కిలోల కార్బన్‌డయాక్సైడ్‌ను మిథనాల్‌గా మార్చే ప్రయోగాత్మక ప్లాంట్ నిర్మాణం తుది దశకు చేరుకున్నదని, డిసెంబర్ 31 నాటికి ఈ ప్లాంట్ పూర్తకాగలదని సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ తెలిపారు. ఈ ప్లాంట్‌లో 99.9 శాతం కర్బన ఉద్గారాలను మిథనాల్‌గా మార్చేందుకు ఎలక్ట్రోస్టాటిక్ ప్రెసిపిటేటర్స్ (ఈఎస్‌పీ)ని నెలకొల్పామన్నారు. కోలిండియా అనుబంధ రీసెర్చ్ యూనిట్ సీఎం పీడీఐఎల్ సహకారంతో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నామని, ఇందుకోసం రూ.20 కోట్ల ఖర్చు చేస్తున్నట్టు, రోజుకు 180 కేజీల మిథనాల్‌ను తయారుచేస్తామన్నారు. ఈ మిథనాల్‌ను ఎరువులు, అక్రిలిక్, ప్లాస్టిక్, సింథటిక్, ఫైబర్ వస్త్రాలు, ఫ్లైవుడ్, పెయింట్స్ తయారీలో వినియోగిస్తారని తెలిపారు.

మళ్లీ పెరిగిన బంగారం ధర

న్యూఢిల్లీ, నవంబర్ 18: గత కొద్ది రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం మళ్లీ ప్రియమైంది. ప్రస్తుత పెండ్లిళ్ల సీజన్‌కావడంతో ఆభరణాల వర్తకులు, రిటైలర్లు ఎగబడి కొనుగోళ్లు జరపడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ ఊపందుకోవడంతో ధరలు పెరిగాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గత నాలుగు రోజులుగా తగ్గుతూ వచ్చిన పుత్తడి ధర సోమవారం ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన తులం ధర రూ.400 పెరిగి రూ.77,450కి చేరుకున్నది. అంతకుముందు ధర రూ.77,050గా ఉన్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ ధర రూ.660 ఎగబాకి రూ.76 వేల పైకి రూ.76,310కి చేరుకున్నది. అలాగే 22 క్యారెట్ గోల్డ్ ధర రూ.600 ఎగబాకి రూ.69,950 పలికింది.

92 వేలకు వెండి

బంగారంతోపాటు వెండి కూడా వెలిగింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.1,810 అధికమై రూ.92 వేలు పలికింది. అంతకుముందు ఇది రూ.90,190గా ఉన్నది. కానీ హైదరాబాద్‌లో మాత్రం రూ.99 వేల వద్ద స్థిరంగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ ధర భారీగా పుంజుకోవడంతోపాటు దేశీయంగా కొనుగోళ్లు ఊపందుకోవడం వల్లనే ధరలు పెరిగాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది తెలిపారు. అలాగే గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,600 డాలర్ల పైన కదలాడుతుండగా, వెండి 26 డాలర్ల స్థాయిలో ఉన్నది.

ఒకేరోజు 5 లక్షల మంది

ఆదివారం ప్రయాణించిన విమాన ప్రయాణికులు

న్యూఢిల్లీ, నవంబర్ 18: దేశవ్యాప్తంగా విమానాల్లో ప్రయాణించేవారు రికార్డు స్థాయికి చేరుకున్నారు. ఆదివారం ఒకేరోజు ఏకంగా 5 లక్షల మంది దేశీయంగా విమానాల్లో ప్రయాణించారు. పండుగ, పెండ్లిళ్ల సీజన్‌కావడంతో ప్రయాణాలు చేసేవారు అధికంగా ఉన్నారని పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఈ నెల 17న ఒకేరోజు దేశీయంగా నడిచిన 3,173 విమానాల్లో 5,05,412 మంది ప్రయాణించారని తెలిపింది.

హైదరాబాద్‌లోనూ పెరిగారు..

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి గత నెలలో విమాన ప్రయాణికులు 22 శాతం మేర పెరిగినట్టు జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ తాజాగా వెల్లడించింది. అక్టోబర్ నెలలో 24.95 లక్షల మంది ప్రయాణించారు.

రూ.50 లక్షల కోట్లు

35 రోజుల్లో ఆవిరైన మదుపరుల సంపద • స్టాక్ మార్కెట్లలో నష్టపుటేరులు

ముంబై, నవంబర్ 18: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలు.. లక్షల కోట్ల రూపాయల్లో మదుపరుల సంపదను హరించాయి. గత 35 రోజుల్లో (ట్రేడింగ్ సెషన్లలో) ఏకంగా రూ.50 లక్షల కోట్లకుపైగా మార్కెట్ విలువ పడిపోయింది మరి. ఈ ఏడాది సెప్టెంబర్ 27న బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.478.93 లక్షల కోట్లుగా ఉంటే.. ఈ నెల (నవంబర్) 18న అది రూ.428.67 లక్షల కోట్లకు క్షీణించింది. దీంతో రూ.50.26 లక్షల కోట్లు ఆవిరైనట్టైంది. బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 8,639.24 పాయింట్లు దిగజారింది. సెప్టెంబర్ 27న సెన్సెక్స్ ఆల్‌టైమ్ హై 85,978.25 పాయింట్ల వద్ద ఉన్నది.

తరలిపోతున్న ఎఫ్ఐఐలు

భారతీయ మార్కెట్లకు విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) దూరం జరుగుతున్నారు. స్టాక్ మార్కెట్లు ట్రేడైన గత 35 రోజుల్లో రూ.1.15 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇక ఎఫ్ఐఐలుసహా విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐలు) గత నెల ఒక్క అక్టోబర్‌లో తరలించుకుపోయిన పెట్టుబడుల విలువే రూ.1,13,858 కోట్లుగా ఉన్నది. ఈ నెల మొదలు ఇప్పటిదాకా దాదాపు మరో రూ.23వేల కోట్లను తిరిగి లాగేసుకున్నట్టు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) గణాంకాలు చెప్తున్నాయి. చైనా, జపాన్ మార్కెట్లు ఆకర్షణీయంగా కనిపిస్తుండటం, దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరాశాజనకంగా నమోదవుతున్న కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు వంటివి భారత్‌కు ఎఫ్‌పీఐలను దూరం చేస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠాలకు పడిపోతుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో డాలర్ ఇండెక్స్ పెద్ద ఎత్తున బలపడిన విషయం తెలిసిందే. ఈ పరిణామం రూపాయిపై సహజంగానే ప్రభావం చూపుతున్నది.

కోలుకోని సూచీలు

సెన్సెక్స్, నిఫ్టీలు మళ్లీ నష్టాలకే పరిమితమయ్యాయి. సోమవారం ఉదయం ఆరంభం నుంచే సెల్లింగ్ ప్రెషర్ కనిపించగా.. ఐటీ, చమురు షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 241.30 పాయింట్లు లేదా 0.31 శాతం క్షీణించి 77,339.01 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 615.25 పాయింట్లు కోల్పోవడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 78.90 పాయింట్లు లేదా 0.34 శాతం దిగజారి 23,453.80 వద్ద ముగిసింది. నిఫ్టీకి వరుసగా ఇది ఏడోరోజు నష్టం.

ప్రధాన కారణాలు

- విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ
- అమెరికా ఎన్నికల్లో ట్రంప్ విజయం
- డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం
- పేలవమైన త్రైమాసిక ఆర్థిక ఫలితాలు
- విజృంభించిన ద్రవ్యోల్బణం
- లాభాల స్వీకరణ దిశగా మదుపరులు

ఐఎస్‌బీకి నూతన లోగో

హైదరాబాద్, నవంబర్ 18: ది ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నూతన లోగోను ఆవిష్కరించారు. బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో నూతన లోగోను ఆవిష్కరించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పరిణామం ఐఎస్‌బీ వారసత్వానికి, ఆశయానికి అనుగుణంగా ఉంటుందని పేర్కొంది.

ఎస్బీఐ మరో 500 శాఖలు

ముంబై, నవంబర్ 18: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ కొత్తగా 500 శాఖలను ప్రారంభించబోతున్నది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..అధిక వడ్డీరేట్ల కారణంగా ప్రజలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, దీంతో వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని, ఈ నేపథ్యంలో బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాలని సూచించారు.

ఆరోగ్య సంరక్షణలో ఏఐ: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): తెలంగాణను త్వరలో క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మారుస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. 'ఆరోగ్య సంరక్షణ రంగంలో కృత్రిమ మేధ'పై హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేధను విస్తృతంగా వినియోగించే దిశగా ముందుకు సాగుతున్నదని మంత్రి పేర్కొన్నారు. రేడియాలజీ రోగనిర్ధారణ పరీక్షల్లో స్పెషలిస్టు వైద్యులకు ఇప్పటికే ఏఐ తోడ్పాటునందిస్తున్నదని, పరిశోధనల ద్వారా దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐజీలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌ను ఏర్పాటు చేసి ప్రపంచ ఆరోగ్యరంగానికి దిక్సూచిగా మారిన నాగేశ్వర్‌రెడ్డి తమ పరిశోధనలను ఇంకా ముందుకు తీసుకెళ్లి రాష్ట్ర ప్రతిష్ఠను పెంచాలని శ్రీధర్ బాబు కోరారు. ఏఐజీలో కృత్రిమ మేధతో పనిచేసే 'మిరా' అనే వర్చ్యువల్ వైద్య సహాయకురాలిని ప్రవేశ పెట్టి ఈ రంగంలో ఆయన ఆదర్శప్రాయులుగా మారారని శ్రీధర్ బాబు కొనియాడారు.

గిరిజన నాయకుడి అరెస్టు

• గిరిజన రైతులను విడుదల చేయాలన్నందుకు..

జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్

జక్రాన్‌పల్లి, నవంబర్ 18 : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో అక్రమంగా అరెస్ట్ చేసిన గిరిజన రైతులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినందుకు లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్‌ను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఆయనను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మోహన్‌నాయక్ మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీల పేరుతో అక్రమంగా లంబాడా రైతుల భూములను ప్రభుత్వం లాక్కోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం గిరిజన రైతుల భూములను లాక్కొని పొట్టకొట్టొద్దని కోరారు.

చెరువులో చేప పిల్లల విడుదల

రుద్రూర్, నవంబర్ 18: మండల కేంద్రంలోని చెరువులో సోమవారం చేప పిల్లలను విడుదల చేశారు. రుద్రూర్ మండల కేంద్రంలోని చెరువులో 1,38,800, రాణంపల్లి గ్రామ కొత్త చెరువులో 36,310 మొత్తం 1,75,110 చేప పిల్లలను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు డు ఇందూరి చంద్రశేఖర్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు పార్వతి ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పాటల పోటీలు

ఖలీల్‌వాడి, నవంబర్ 18 : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, కార్యదర్శి బుగ్గారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పాటల పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని పాటలు ఆలపించారు. న్యాయ నిర్ణేతలుగా రాజేంద్రప్రసాద్, వి.అపర్ణ, పి.యశోద, కె.వీణ, జి.మధుసూద, కర్క రమేశ్ వ్యవహరించారు. విజేతలకు ఈనెల 20న న్యూఅంబేద్కర్ భవన్‌లో బహుమతులు అందజేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి తెలిపారు.

కబడ్డీలో పడిగెల్ విద్యార్థుల ప్రతిభ

విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న పడిగెల్ విద్యార్థులు

వేల్పూర్, నవంబర్ 18: ఇటీవల మోతె గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడల్లో గెలుపొందిన పడిగెల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో సోమవారం గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు జెండా ఊపి ప్రారంభించి, మాట్లాడారు. పడిగెల్ గ్రామానికి ఐదు బహుమతులు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ర్యాలీలో వీడీసీ సభ్యులు పాక్‌పట్ల గంగారెడ్డి, జక్కుల రాజేశ్వర్, మాతపు సాయన్న, మాడవేడి గంగాకిషన్, చెండి రాములు, పీఏసీఎస్ చైర్మన్ యాల్ల హన్మంత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాంచందర్, పీడీ రాజేశ్వర్, జలందర్, శంకర్, నారాయణ, దాస్, విద్యార్థులు పాల్గొన్నారు. వేల్పూర్ మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన వేల్పూర్ క్రీడాకారులను వీడీసీ అధ్యక్షుడు పురుషోత్తం, సభ్యులు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

పూజలు నిర్వహిస్తున్న హంపీ పీఠాధిపతి విద్యారణ్యాభారతీ తీర్థ స్వామి

కోటగిరి(పోతంగల్), నవంబర్ 18: కోటగిరిలో నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప-సాయిబాబా ఆలయ ప్రారంభోత్సవాలు ఐదు రోజులుగా కన్నుల పండువగా కొనసాగాయి. ఇందులో భాగంగా సోమవారం హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ తీర్థ స్వామి, తిరుపతి చంద్రమౌళి గురుస్వామి, వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీ తీర్థ స్వామి ప్రత్యేక పూజలు చేసి ప్రవచనాలు చేశారు. ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అన్సాన్‌పల్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఇందల్వాయి, నవంబర్ 18 : మండలంలోని అన్సాన్‌పల్లిలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గోవిందమాంబ -పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేకం మహోత్సవం, జాతర తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వీడీసీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహాగణపతి పూజ, విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. గంగప్రసాద్ దీక్షిత్ పండిత్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

వినాయక్‌నగర్, నవంబర్ 18: జిల్లా కేంద్రంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 11 మందిపై కేసు నమోదు కాగా..ఇద్దరికి మూడు రోజుల చొప్పున జైలుశిక్ష విధించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 11మందిపై కేసు నమోదు చేసి, వారికి ట్రాఫిక్ సీఐ వీరయ్య కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం కోర్టులో హాజరుపర్చగా.. బురుడుగల్లీకి చెందిన బచ్చువార్ నీలేశ్‌తోపాటు మహారాష్ట్రలోని ఉమ్రీ ప్రాంతానికి చెందిన బోయిన్‌వాడ్ మాధవ్‌కు ఒక్కొక్కరికీ మూడు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ మార్నింగ్ కోర్టు మేజిస్ట్రేట్ అహ్మద్ మోహియుద్దీన్ తీర్పు వెలువరించారు. మిగతా తొమ్మిది మందికి రూ.21,500 జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

నిందితుడిని పోలీసులకు అప్పగించిన స్థానికులు



నిందితుడు మహేందర్

వినాయక్‌నగర్, నవంబర్ 18: జిల్లా కేంద్రంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి అనంతరం ఓ యువకుడు ఏటీఎం సెంటర్‌లో చోరీకి యత్నించాడు. స్థానిక సీతారాంనగర్ కాలనీ వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేస్తుండగా.. అదే సమయంలో బ్యాంక్ అలారం మోగడంతో పాటు స్థానికులు సైతం మేల్కొన్నారు. వెంటనే వెళ్లి ఏటీఎంను ధ్వంసం చేస్తున్న దుండగుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు వెంటనే నిందితుడిని అదుపులోకి విచారించగా ఎడపల్లి మండలం పోచారం గ్రామానికి చెందిన మహేందర్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

వినాయక్‌నగర్, నవంబర్18: ఓ శుభకార్యంలో కూలర్ అమర్చడానికి యత్నించిన ఓ యువకుడు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. నగరంలోని ధర్మపురి హిల్స్ ప్రాంతంలో బంధువుల ఇంట్లో ఆదివారం నిర్వహిస్తున్న శుభకార్యానికి బోధన్ పట్టణానికి చెందిన అయాన్(22) హాజరయ్యాడు. ఫంక్షన్‌లో కూలర్ అమర్చేందుకు యత్నించిన అయాన్‌కు విద్యుత్ షాక్ తగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

మోర్తాడ్, నవంబర్ 18: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్, ముప్కాల్‌లో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి మిట్టపల్లి లక్ష్మణ్‌ను అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... కమ్మర్‌పల్లి బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హాసాకొత్తూర్, ముప్కాల్‌లో దొంగతానాలు చేసినట్లు ఒప్పుకున్నాడని, మెట్‌పల్లికి కారు కొనుగోలు చేసేందుకు వెళ్తున్నానని చెప్పాడని ఎస్సై పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రూ.1.80లక్షల నగదు, రెండు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

పట్టణంలో వరుస చోరీలు

ఆర్మూర్‌టౌన్,నవంబర్18: పట్టణంలో వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని పెర్కిట్‌లో 6వ వార్డులో ఆదివారం అర్ధరాత్రి దొంగలు మహ్మద్ తాజుద్దీన్ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. స్థానికుల కథనం.. మహ్మద్ తాజుద్దీన్ ఆదివారం ఇంటికి తాళం వేసి కామారెడ్డిలోని దవాఖానకు వెళ్లాడు. సోమవారం తిరిగి ఇంటికి రాగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు వచ్చి వచ్చి పరిశీలించారు. రూ.10 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.లక్ష నగదు చోరీకి గురైందని బాధితుడు పోలీసులకు తెలిపాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వెంకటరమణా గౌడ్ తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ టవర్‌ను తొలగించాలి

ఏర్గట్ల, నవంబర్ 18: మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టవర్‌ను తొలగించాలని కోరురూ గ్రామానికి చెందిన పలువురు సోమవారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతి పత్రం అందజేశారు. జనవాసాల మధ్య కొన్నేండ్లుగా కొనసాగుతున్న బీఎస్ఎన్ఎల్ టవర్ నుంచి వెలువడుతున్న రేడియేషన్ కారణంగా ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నారు.. అమ్మకపు జోరు..

ధర్పల్లిలో అన్ని రకాల నార్లను విక్రయిస్తున్న రైతు

ధర్పల్లి, నవంబర్ 18 : యాసంగిలో నీటి వనరులు తక్కువగా లభ్యమవుతున్నందున రైతులు వరి పంటకు బదులు కొద్దిమేర ఆరుతడి పంటలపై దృష్టి మళ్లిస్తారు. అయితే, ఆరుతడి పంటలు వేయాలంటే ముందుగా పంటలకు సంబంధించిన నారు పోసి .. నెల, రెండు నెలల పాటు వరినారును కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంటుంది. కొందరు రైతులు రెడీమేట్‌గా అన్ని రకాల ఆరుతడి పంటలకు సంబంధించిన నారును పెంచి, అంగట్లలో విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. అటు నారు విక్రయించే రైతులకు లాభాలతో పాటు ఇటు నారును కొనుగోలు చేసే రైతులకు సైతం సమయం ఆదా కావడంతో పాటు వ్యయప్రయాస లేకుండా పోతున్నది. దీంతో ఆరుతడి పంటలు వేయాలనుకునే రైతులు అంగడికి వచ్చి నారు కొనుగోలు చేస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన రైతులు వానకాలం వరికోతలకు ముందుగానే అక్కడ అన్నిరకాల నారు పంటలు పండించి, వివిధ ప్రాంతాల్లోని అంగళ్లకు వెళ్లి విక్రయిస్తున్నారు. ఇందులో భాగంగా ధర్పల్లిలో జరిగే అంగడిలో ఎల్లారెడ్డికి చెందిన పలువురు రైతులు టమాట, వంకాయ, ఉల్లి, మిరప తదితర ఆరుతడి పంటలకు సంబంధించిన అన్నిరకాల నారును తీసుకవచ్చి విక్రయిస్తున్నారు. నారు రెడీమేడ్‌గా దొరుకుతుండడంతో యాసంగిలో ఆరుతడి పంటలు పండించాలనుకునే వారు కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. అటు నారు విక్రయిస్తున్న రైతుకు, కొనుగోలు చేస్తున్న రైతులకు ప్రయోజకంగా మారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'ఉపాధి' పనుల్లో బయటపడిన అవకతవకలు



విచారణ వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

నందిపేట్, నవంబర్ 18: 2023-24లో నిర్వహించిన జాతీయ ఉపాధిహామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. సోమవారం నందిపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 15వ విడుత ప్రజావేదిక నిర్వహించగా డీఆర్‌డీవో సాయాగౌడ్, విజిలెన్స్ అధికారి నారాయణ, ఎస్ఆర్‌పీ సురేశ్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన తనిఖీల్లో గుర్తించిన అవకతవకలను ప్రజావేదికలో ఆడిట్ బృందం వెల్లడించింది. అక్రమాలకు సంబంధించి నిధుల రికవరీకి డీఆర్‌డీవో ఆదేశించారు.

పోతంగల్ విండోకు ఇన్‌చార్జీల నియామకం

పోతంగల్, నవంబర్ 18 : పోతంగల్‌లోని విశాల సహకార సంఘం లావాదేవీల్లో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పాలకవర్గాన్ని రద్దు చేశారు. గత నెలలో సీఈవో భరత్‌ను సస్పెండ్ చేస్తూ అలసత్వం ప్రదర్శించిన పాలకవర్గానికి పై ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ నోటీసులు జారీ చేశారు. నోటీసులకు సరైన సమాధానం రాకపోవడంతో పాలకవర్గాన్ని రద్దు చేశారు. ఈ మేరకు పోతంగల్ సహకార సంఘం అడ్మినిస్ట్రేటర్లుగా డీసీవో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ రియాజుద్దీన్, డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.